# రజిత

**అత్యాచారానికి** బలి అయిపోయిన కూతుర్ని చూస్తూ కుమిలిపోతున్నాడు కాశి. నిత్యం సందడిగా ఉండే ఆ లోగిలి ఉన్నట్లుండి బోసిపోయింది. మనుషులున్నా నిర్మానుష్యంగా వుంది. ఆ గూటిలోని ఏ గుండెను కదలించినా విషాదమే విరజిమ్ముతోంది.

రజితకు జరిగిన అన్యాయాన్ని తలచుకుంటూ కృంగిపోవడం వల్ల ఆ పిల్ల మరింత బేజారైపోతోంది. పదిరోజులైనా పచ్చి మంచినీళ్ళు ముట్టుకోలేదు. "ఇలా అయితే నీ ఆరోగ్యం ఏంగాను?... లే...లేచి కాస్త ఎంగిలి పడు" అంటూ కూతురి దుస్థితికి తల్లడిల్లిపోతున్న తమ్ముణ్ణి ఊరడించేందుకు ప్రయత్నించింది కాంతం.

"నా సంగతి సరే, మీ వంశీకెలా వుందో చెప్పు" అన్నాడు కాశి అక్క కళ్ళల్లోకి బేలగా చూస్తూ.

"ఏం చెప్పమంటావ్. రోలు మద్దిలతో చెప్పుకున్నట్టుంది నా పరిస్థితి. పోగొట్టుకున్న వాడి చేయిని ఎలానూ తేలేం. అందుకే నా చేత్తో ముద్ద తినిపిస్తూ వాడి కన్నీళ్ళు తుడుస్తున్నాను."

గాఢంగా నిట్టూర్చాడు కాశి.

కాంతం, కాశి తోబుట్టువులు. రజిత కాశీకి లేక లేక కలిగిన నలుసు. చక్కని చుక్క అందాల భరిణ. ఆ పిల్ల పుట్టినప్పుడే అరవై ఆరు కళలతో పుట్టిందంటారు. అంతటి సౌందర్యరాశిని తన ఇంటి కోడల్ని చేసుకోవాలనని కాంతం ముచ్చట పడిందంటే అందులో ఆశ్చర్యమేముంది? పోతే తేజకు కూడా ఆమె అంటే ఎంతో యిష్టం. ఆ కారణంగా గౌరీపతి కూడా వాళ్ళ వివాహానికి అడ్డు చెప్పలేకపోయాడు. దాంతో నిశ్చితార్థం కూడా జరిగిపోయింది.

ఇలా వుండగా ఓరోజు అర్థరాత్రి అంతా ప్రశాంతంగా నిద్రపోతున్న సమయంలో తలుపులు బ్రద్దలు కొట్టుకుని లోపలకు ప్రవేశించారు బందిపోట్లు. ఈ హఠాత్సంఘటనకు మిన్ను విరిగి మీద పడిందా అనిపించింది.

దుండగులు తుపాకులతో బెదిరించి నగానట్రా దోచుకున్నారు. అక్కడితో ఆగకుండా అందరిముందే రజితపై అత్యాచారం జరిపి ఆకలి తీర్చుకున్నారా కామాంధులు.

ఆ దుర్ఘటన గుర్తుకు రావడంతో గుండె గుభిల్లుమంది.

అంతే, మరి ఆలోచించలేక పోయాడు కాశి. "నువ్వేం దిగులు పడకు. రజిత ఎన్నటికీ నా కోడలే. అనుకున్న ముహూర్తానికే ఈ పెళ్ళి జరుగుతుంది" అన్నది కాంతం.

"ఏమిటో ఆపిల్ల మాత్రం తను ఎంగిలి విస్తరినైపోయానని, ఎవరికీ పనికిరానంటోంది. అయినా ఆ మాట నువ్వంటే ఏం లాభం? తేజని అనమను అప్పుడైనా దాని మనస్సు మారుతుందేమో!

అర్థింపుగా వున్నాయి అతడి మాటలు.

"తేజ మాత్రం ఎందుకు కాదంటాడు? వాడికి రజిత అంటే ప్రాణం. పైగా వాడు నా

కొడుకు. నామాటే వాడిమాట" అన్నది తనయుడిపై కొండంత నమ్మకం వున్న కాంతం.

"రజితా!" ప్రేమగా పిలుస్తూ దగ్గరకెళ్ళాడు తేజ.

"వద్దు నన్ను తాకొద్దు" దూరంగా జరిగింది రజిత.

"నీపై జరిగిన అత్యాచారం కేవలం యాదృచ్ఛికం. అది నీ తప్పుకాదు. జరిగింది మరచిపో. ఇప్పటికీ నేను నిన్నే మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంటూ అభ్యర్థించాడు తేజ.

"నామీద సానుభూతితో నువ్వు నన్ను కోరుకున్నా నేను మాత్రం నిన్ను చేసుకోవడానికి సిద్ధంగా లేను" అంది రజిత.

ఆ మాటకు అవాక్కైపోయారంతా.

ఆమె నుండి అటువంటి సమాధానం వస్తుందని ఊహించని తేజ దెబ్బతిన్నట్లైపోయాడు.

"ఏమిటమ్మా ఆ మాటలు. అబ్బాయి ఎంతో ఔదార్యంతో నిన్ను కోరుకుంటూ వుంటే' అన్నాడు కాశి కూతురి ధోరణికి బెంగపడుతూ.

"నాకు కావలసింది నా పట్ల ఔదార్యం చూపే వ్యక్తి కాదు. నన్ను కాపాడుకోగలడన్న మగధీరుడు."

"మంచిదే అటువంటి వ్యక్తి ఎవరైనా నీ మనస్సులో వుంటే చెప్పమ్మా. అతడు ఎక్కడున్నా బ్రతిమలాడి తీసుకొస్తాను"

"ఎక్కడో ఎందుకు నాన్నా ఇక్కడే ఉన్నాడు తేజ తమ్ముడు వంశీ."

"వాడా!?" నవ్వాడు తేజ.

అతడి నవ్వులో అవహేళన ధ్వనిస్తోంది.

"ఏం?... ఎందుకలా నవ్వుతున్నావ్?" అంటూ అతడి వంక చిరాగ్గా చూసింది రజిత.

"అదేమిటమ్మా చెయ్యిలేని వంశీనా నువ్వు కోరుకునేది? అంగవైకల్యం వున్న వ్యక్తి నీ జీవితానికి రక్షణ ఎలా ఇవ్వగలుగుతాడనుకుంటున్నావ్?" అన్నాడు కాశి కూతురి ధోరణికి విస్తుపోతూ.

"మనో వైకల్యం కంటే అంగవైకల్యమే మేలు నాన్నా. మీరంతా వాడికి చెయ్యి లేదంటున్నారే తప్ప వాడి చెయ్యి ఎలా పోయిందో మీకెవరికీ తెలీదా? ఆ రాత్రి దుండగులు మిమ్మల్ని తుపాకులతో బెదిరించి నా మీద అత్యాచారానికి పాల్పడుతూ వుంటే మీరంతా గుడ్లప్పగించి చూసారే తప్ప నన్ను కాపాడటానికి ఒక్కరంటే ఒక్కరు ముందుకు రాలేక పోయారు. కాబోయే పెళ్ళాం మానభంగానికి గురౌతున్నా ప్రాణభీతితో మిన్నకుండిపోయాడే తప్ప ముందుకు రాలేకపోయాడు తేజ. ఏ స్త్రీ అయినా తనను కాపాడుకోగలడన్న విశ్వాసం వున్న వ్యక్తినే భర్తగా ఎంచు కుంటుంది. ఇటువంటి పిరికివాడిని కాదు"

రజిత మాటలకు ఉక్రోషంతో ఊగిపోతూ "నిన్ను రక్షించదానికి పెనుగులాడిన వంశీకేమైంది? దుండగులు వాడిచేతిని నిర్ధాక్షణ్యంగా నరికేసారు. నేనెదిరించినా నాకూ అదే

గతి పట్టివుండేది" అన్నాడు తేజ.

"నిజమే నాకంటే నీకు నీ ప్రాణమే ఎక్కువ. వంశీకి నేనేమీ కాకున్నా నా కోసం ప్రాణాలకు తెగించాడు. కళ్ళముందు జరుగుతున్న ఘోరాన్ని చూడలేక నన్ను రక్షించే ప్రయత్నం చేసాడు. ఆ మాత్రం ధైర్యం చేయలేని నీలాంటి పిరికి పందను నేనెలా చేసుకుంటానను కుంటున్నావ్?" అన్నది రజిత.

ఆ మాటతో తల తీసేసినట్లయింది తేజకి. అంతే మరి అక్కడ నిలవలేక బయటకు వెళ్ళిపోయాడు.

"నువ్వన్నది నిజమే తల్లీ. నీ నిర్ణయం సర్వసమ్మతం. అందరూ హర్షించదగ్గది. నువ్వు నా రెండో బిడ్డని కోరుకుంటున్నావంటే నాకు మరీ సంతోషం. అన్ని అవయవాలూ లక్షణంగా వున్న తేజకి ఎవరైనా పిల్లనిస్తారు. నా బెంగల్లా వంశీ గురించేనమ్మా. చేయి చాపి వాడికి జీవితాంతం నీ చేయి అందిస్తానంటే నాకు అంతకన్నా కావలసిందేముంది?" అంటూ రజితను ప్రేమగా దగ్గరకు తీసుకుంది కాంతం.

(జూలై 2000 ఆంధ్రభూమి మంత్లీ)